క్లుప్తంగా

వాహనాల తనిఖీలు

నింద్ర: మండల కేంద్రంలో శనివారం నింద్ర పోలీసులు వాహనాలు తనిఖీ చేపట్టారు. వాహనదారులకు తప్పనిసరిగా లైసెన్స్, ద్విచక్ర వాహనదారులకుహెల్మెట్ తప్పక ఉండాలని అవగాహన కల్పించారు. వాహనాలకు సంబంధించి రికార్డులు తనిఖీలు చేశారు. పలు వాహనదారులకు సూచనలు ఇచ్చారు. అతి వేగంతో ప్రమాదాలకు గురికాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ఏసీ చోరీకి యత్నం



ఏసీ ఫ్యాన్, చోరీకి ఉపయోగించిన సుత్తి

నగరి: మున్సిపల్ పరిధిలోని కొత్తపేటలో అరుణ్ అనే వ్యక్తి నివాసానికి అమర్చిన ఏసీని శుక్రవారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు చోరీ చేసే ప్రయత్నం చేశారు. ఇంటి నుంచి అలికిడి కావడంతో వారు చోరీకి తెచ్చిన సుత్తిని అక్కడే వదిలి పరుగులు తీశారు.

కాలభైరవునికి విశేషాలంకరణ



నగరి: శ్రీకామాక్షీ సమేత కరకంఠేశ్వరాలయంలోని కాలభైరవ సన్నిధిలో శనివారం కాలభైరవాష్టమి పూజలను వైభవంగా నిర్వహించారు. స్వామికి పాలు, పెరుగు పంచామృతం, పన్నీరుతో అభిషేకం చేశారు. అభిషేకానంతరం స్వామికి చందన అలంకారం చేసి ఆభరణాలు, వడమాలలతో విశేషంగా అలంకరించగా భక్తులను అమితంగా ఆకట్టుకుంది. అభిషేక పూజల్లోనూ భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. భక్తులకు ఆలయ నిర్వాహకులు ప్రసాదాలతోపాటు, స్వామివా రి పూజా క్యాలెండర్లను అందజేశారు.

రేపటి నుంచి విద్యుత్ సమస్యలపై సభలు

పుత్తూరు: విద్యుత్ శాఖ పుత్తూరు డివిజన్ పరిధిలోని సబ్‌స్టేషన్స్ కమిటీ సమావేశాలు సోమవారం నుంచి రెండు రోజులపాటు నిర్వహిస్తున్నట్లు ఏపీట్రాన్స్‌కో ఏఈలు జైసాయి, రవికుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు పుత్తూరు, గేట్ పుత్తూరు సబ్ స్టేషన్ల వద్ద, మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 5 వరకు లక్ష్మీనగర్, పరమేశ్వరమంగళంలో, మంగళవారం ఉదయం 11కు కళ్యాణపురం, మధ్యాహ్నం 3 గంటలకు పైడిపల్లి సబ్‌స్టేషన్లలో సమావేశాలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. ఆయా సబ్‌స్టేషన్ల పరిధిలోని వినియోగదారులు కమిటీ సమావేశాల్లో పాల్గొని తమ సమస్యలను పరిష్కరించుకోవాలని కోరారు.

అడవికి నిప్పు.. మానవాళికి ముప్పు



అవగాహన కల్పిస్తున్న అటవీ అధికారులు

పాలసముద్రం: అడవులకు నిప్పు మావవాళికి ముప్పు అని సెక్షన్ ఆఫీసర్ మధు తెలిపారు. శనివారం చిత్తూరు తూర్పు అటవీ శాఖాధికారి ఆదేశానుసారం వనదుర్గాపురంలో అడవికి నిప్పు-మానవాళికి ముప్పు అన్న నినాదంతో బీట్ ఆఫీసర్ వరవరాజు, విజయభాస్కర్ ఆధ్వర్యంలో గ్రామాల్లో ర్యాలీ నిర్వహించారు. సెక్షన్ ఆఫీసర్ మధు మాట్లాడుతూ చెట్లు మొక్కల, చెట్లు ఉంటే క్షేమం తదితర అంశాలను వివరించారు. అడవికి నిప్పు పెట్టడంతో వాతావరణ కాలుష్యంతె వన్యప్రాణులు ప్రాణాలు కోల్పోతాయని తెలిపారు. అడవిలో ఎలాంటి నిప్పులు తీసుకెళ్లడం, వంట చేసుకోవడం చేయకూడదని తెలిపారు. అడవి జంతువులను వేటాడితే ఆంధ్రప్రదేశ్ అటవీ చట్టం మేరకు కేసులు పెడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో ప్రజలు పాల్గొన్నారు.

27న వారపు సంత వేలం

గంగాధరనెల్లూరు: 2025–26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి 2025 ఏప్రిల్ 1వ తేదీ మొదలు 2026 మార్చి 31వ తేదీ వరకు జీడీ నెల్లూరు గ్రామ పంచాయతీలో నిర్వహించే వారపు సంతతోపాటు షాపింగ్ కాంప్లెక్స్ రూములను ఈ నెల 27వ తేదీ వేలం నిర్వహించనున్నట్లు పంచాయతీ కార్యదర్శి చంద్ర శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గంగాధరనెల్లూరు గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో వారపు సంత వేలం పాటలో పాల్గొనే వారు రూ.1.25 లక్షలు ధరావత్తు సొమ్మును చెల్లించాలన్నారు. అదేవిధంగా షాపింగ్ కాంప్లెక్స్ రూముల కోసం పదివేల రూపాయలను డీడీ రూపంలో పంచాయతీ కార్యాలయంలో సమర్పించి తగు రశీదులను పొంది వేలంలో పాల్గొనాలని తెలిపారు.

మేత కోసం.. వలసబాట



సూరికాపురంలో ఓ రైతు పొలంలో గొర్రెల మంద

సంకలో సంచి..చేతిలో కర్ర.. నెత్తిన టవలు. ఎండనక.. వాననక.. గాలనక.. మూగజీవాల వెంట పయనం. కొండలు, గుట్టలు, అడవుల్లో సంచారం. మధ్యాహ్నం ఎర్రటి ఎండలో చెట్టు కింద కాసేపు సేద. తిరిగి సాయంత్రానికి చెట్టు, పుట్ట చాటుకో చేరడం. ఇదీ గొర్రెల కాపరులు నిత్యం పడుతున్న ఇబ్బందులు. స్థానికంగా మూగజీవాల పోషణకు సరిపడా గ్రాసం, వాటిని మేపేందుకు బీడు భూములు లేకపోవడంతో గొర్రెల కాపరులు అష్టకష్టాలు పాడుతున్నారు.

– విజయపురం

- నెలల తరబడి ఊరు వదిలేస్తున్న వైనం
- పచ్చిక మొలకొచ్చాకే..గ్రామాలకు
- ఏటా రైతులకు తప్పని ఇబ్బందులు

విజయపురం మండలానికి చెందిన కొందరు గొర్రెల కాపరులు ఏటా సంక్రాంతి పండుగ తర్వాత పాలంబాట పడుతున్నారు. గ్రామంలోని అయిదారుగురు రైతులు బృందంగా ఏర్పడి గొర్రెల మందతో బయల్దేరుతారు. పాలంబాటలో భాగంగా గ్రాసం, నీళ్లు ఎక్కడుంటే అక్కడికి వెళ్తున్నారు. ఇందులో భాగంగా కోసలనగరం గ్రామానికి చెందిన గొర్రెల కాపరులు పశుగ్రాసం కోసం వలస వెళ్లి బీడు భూములు, అటవీప్రాంతం, కొండలు, గుట్టలు ఎక్కువగా ఉన్న మైదాన ప్రాంతాల్లో కనిపిస్తున్నారు. స్థానికంగా వీరికి గ్రామాల్లో తగినన్ని బీడు భూములు లేకపోవడం, చెరువులు, కుంటలు నీటితో నిండిపోవడం, అడవి, గుట్టలకు వెళ్లడానికి సరైన దారి సౌకర్యం లేకపోవడం తదితర కారణాలతో గొర్రెల కాపరులు గ్రాసం కోసం పాలంబాట పడుతున్నారు. రబీ సీజన్ వరకూ స్థానికంగా ఉన్న భూములు, పొలాల్లో గొర్రెలను మేపుకున్నా..తర్వాత సీజన్ పూర్తయిన జనవరి నుంచి ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఇందులో భాగంగా జనవరిలో మొదలైన వలస బాట.. తిరిగి వర్షాలు సకాలంలో కురిసి, పచ్చని పొలాలు, బీడు భూములు పచ్చికతో పరుచుకున్నాక.. వినాయకచవితి నాటికి స్వగ్రామాలకు చేరుతుంటారు.

పశుగ్రాసం కొరత

గ్రామీణ ప్రాంతాల్లో సేద్యం పనులు కనుమరుగవుతున్న నేటి పరిస్థితుల్లో గొర్రెలనే కాదు..గేదెలు, పాడి ఆవులను మేపుకోవడం ఇబ్బందిగా మారింది.

రియల్ ఎస్టేట్‌తో ఇబ్బందులు

చాలా భాగం వ్యవసాయ భూములు రియల్ ఎస్టేట్ వ్యాపారంలో ప్లాట్లుగా మారిపోవడం, ప్రభుత్వ, డీకేటీ భూములు అన్యాక్రాంతం కావడం, చెరువులు, కుంటలకు సమీపాన భూములున్న రైతులు వాటిని ఆక్రమించి సాగు చేయడం, చెరువులు, కుంటలు నిండిపోవడం, గ్రామ సమీపంలోని కొండలు, గుట్టలు, అటవీ ప్రాంతానికి వెళ్లడానికి దారి సౌకర్యం లేకపోవడం తదితర కారణాలతో పశుపోషణకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. గ్రామాల్లో సంప్రదాయ రైతులే కాదు.. మిగిలిన రైతులూ పాడి పోషణపై ఎక్కువగా జీవిస్తున్నారు. ఈ క్రమంలో పాడి పోషకులు మాత్రం స్థానికంగా అందుబాటులోని వ్యవసాయ బోర్ల వద్ద గ్రాసం సాగు చేసి పోషిస్తుండగా, గొర్రెలు, మేకల కాపరులు మాత్రం గ్రాసం కోసం ఇబ్బందులు పడుతున్నారు. వీటిని అధిగమించే క్రమంలో స్థానికంగా ఉన్న ప్రభుత్వ, బీడు భూములను మూగజీవాల మేతకు కేటాయించాలని రైతులు ఏళ్ల తరబడి అటు పాలకులు, ఇటు అధికారులను కోరుతున్నా..అరణ్య రోదనగానే మిగులుతోంది.

కోసలనగరంలో 15 కుటుంబాలు

విజయపురం మండలం కోసలనగరం, శ్రీహరిపురం, విజయపురం, గొల్లకండ్రిగ, తెల్లగుంట, కలియంబాకం మిట్టకండ్రిగ, పాతర్కాడు పంచాయతీలో 1000 యాదవ కుటుంబాలు ఉన్నాయి. కోసలనగరంలో గొర్రెల మందలపై ఆధారపడి జీవిస్తున్న యాదవ కుటుంబాలు ఉన్నాయి. వీరిలో ఒక్కో రైతు వంద నుంచి 150 గొర్రెలు మేపుతున్నారు. ఈ క్రమంలో అయిదారు కుటుంబాలు రెండు బృందాలుగా కూడి మందతో జనవరిలో గ్రాసం కోసం పడమర వైపు వెళ్తుంటారు. పాలంబాటలో గ్రామాలకు వెళ్లినప్పుడు స్థానికంగా ఉన్న రైతులు వీరిని సంప్రదించి, తమ పొలంలో రాత్రివేళలో గొర్రెల మందను తోలేలా ఏర్పాటు చేసుకుంటున్నారు. ఇందుకుగాను ఆ రైతు.. కాపరులకు మూడు పూటలా భోజనం పెడుతున్నారు. ఆ రోజుకు రైతులెవరూ ముందుకు రాకుంటే, విశాలమైన ప్రాంతంలో రాత్రి పూట బస చేస్తున్నారు. ఆ రోజుకు కావాల్సిన వంటను వీరు వండుకోవడమో, లేక సమీప గ్రామాలకు వెళ్లి తెచ్చుకోవడమో చేస్తున్నారు.

విద్యాభివృద్ధి కోసం కృషి



కళామందిరాన్ని ప్రారంభిస్తున్న సంస్థ చెర్మన్, సిబ్బంది

పాలసముద్రం: తిరుమలరాజుపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యాభివృద్ధి కోసం తనవంతు ఎల్లప్పుడు కృషి చేస్తామని ఏట్రీయా ఫౌండేషన్ సంస్థ చైర్మన్ సీఎస్ సుందేర్‌రాజు తెలిపారు. శనివారం పాఠశాల ఆవరణలో సంస్థ నిధులు రూ.7 లక్షలతో నిర్మించిన కళామందిరం(ఆడిటోరియం) ప్రారంభోత్సవం కార్యక్రమానికి ఆయన విచ్చేశారు. సీఎస్ సుందేర్‌రాజు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల విద్యార్థులు చదువుల కోసం తమ సంస్థ ఎంతైనా ఖర్చు పెడుతుందని తెలిపారు. అయితే విద్యార్థులు ఉన్నత చదువులు చదివి పాఠశాలకు మంచి పేరు తేవాలన్నారు. కళామందిరాన్ని సెమినార్స్‌కు, సైన్స్‌ఫెయిర్స్ తదితర కార్యక్రమాలకు వాడాలని సూచించారు. ఎంఈఓ గిరిజ మాట్లాడుతూ ఏట్రీయా ఫౌండేషన్ సంస్థ వారు చేస్తున్న సేవలను కొనియాడారు. అనంతరం కళామందిరాన్ని రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచ్ జీవిత, గంగరాజు, బాలరాజు, నాగరాజు, నరసరాజు, ఉపాధ్యాయులు మురుగదాస్, సీఆర్పీ మహాలక్ష్మి, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

వేసవిలో అప్రమత్తంగా ఉండండి



ఉపాధిహామీ పనులను పరిశీలిస్తున్న ఏపీఓ

కార్వేటినగరం: వేసవిలో జాతీయ ఉపాధిహామీ కూలీలు అప్రమత్తంగా ఉండాలని ఏపీఓ జాహ్నవి అన్నారు. శనివారం అమ్మపల్లి వద్ద పనులు నిర్వహిస్తున్న ఉపాధి కూలీలకు ఓఆర్ఎస్, మజ్జిగ ప్యాకెట్లను పంపిణీ చేశారు. రోజు రోజుకీ పెరుగుతున్న ఉష్ణోగ్రతలను దృష్టిలో ఉంచుకుని ఉదయం 5 గంటల నుంచి 10 గంటల వరకు పనులు చేయాలని సూచించారు. అప్రమత్తంగా లేకపోతే ఎండలకు వడదెబ్బ తగిలే అవకాశం ఉందన్నారు. వేసవిలో కూలీలకు గిట్టుబాటు కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వం కూలీలను పెంచిందని, ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం ఫారంపాండు పనులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో చెంగ్రాయులు యాదవ్, క్షేత్ర సహాయకుడు జయశంకర్, మేట్లు, కూలీలు పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనాలను ఢీకొన్న కారు



కారు ఢీకొని గాయపడిన పార్థసారథి



చికిత్స పొందుతున్న మహిళా పోలీసులు



కారు ఢీకొనడంతో గాయపడిన లక్ష్మీపతి



ప్రమాదంలో దెబ్బతిన్న కారు

– ముగ్గురికి తీవ్రగాయాలు

శ్రీరంగరాజపురం(కార్వేటినగరం): అతివేగంగా దూసుకొచ్చిన కారు రెండు ద్విచక్ర వాహనాలను ఢీ కొనడంతో మహిళా సంరక్షణ కార్యదర్శితో పాటు ఆమె భర్త, మరో వ్యక్తికి తీవ్ర గాయాలైన సంఘటన నాయుడుపల్లి వద్ద శనివారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. శ్రీరంగరాజపురం మండలం నాయుడుపల్లికి చెందిన లక్ష్మీపతి తన సొంత పనుల నిమిత్తం ద్విచక్ర వాహనంపై మండల కేంద్రానికి వెళ్లి తిరుగు పయనమయ్యాడు. దామలచెరువు మండలం ఒడ్డుపల్లికి చెందిన నలుగురు వ్యక్తులు కారులో చిత్తూరు వైపు నుంచి తమిళనాడులోని పళ్లిపట్టుకు వెళ్తూ ముందు వైపు బైక్‌పై వెళ్లుతున్న లక్ష్మీపతిని వెనుక నుంచి కారు వేగంగా ఢీ కొట్టింది. అతను తీవ్రంగా గాయపడ్డాడు. అదే సమయంలో శ్రీరంగరాజపురం మండల జీఎంఆర్ పురం గ్రామానికి చెందిన సునీత(28) అదే మండలంలోని ఏఎంపురం గ్రామ సచివాలయంలో గ్రామ మహిళా సంరక్షణ కార్యదర్శిగా(మహిళా పోలీస్) విధులు నిర్వహిస్తోంది. విధులకు హాజరయ్యేందుకు తన భర్త పార్థసారథి(28)తో కలసి ద్విచక్రవాహనంలో వెళ్తుండగా ఎదురుగా వస్తున్న ఈ బైక్‌ను కూడా కారు అదుపు తప్పి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో భార్యాభర్తలిద్దరికీ తీవ్రగాయాలయ్యాయి. ప్రమాదంలో గాయపడిన ముగ్గురినీ ప్రథమ చికిత్స నిమిత్తం మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం తిరుపతికి తరలించారు. ప్రమాదంలో కారు, రెండు ద్విచక్ర వాహనాలు దెబ్బతిన్నాయి. సమాచారం అందుకున్న పోలీసులు ప్రమాదానికి గురైన రెండు ద్విచక్ర వాహనాలు, కారును స్వాధీనం చేసుకున్నారు. అనంతరం ఎస్‌ఐ సుమన్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

జలమే జీవనాధారం



మాట్లాడుతున్న ప్రిన్సిపల్ చంద్రమౌళి

పుత్తూరు: సకల ప్రాణులకు జలమే జీవనాధారమని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ బి.చంద్రమౌళి అన్నారు. శనివారం కళాశాలలో మండల లీగల్ సెల్ ఆధ్వర్యంలో ప్రపంచ జల దినోత్సవాన్ని నిర్వహించారు. ప్రిన్సిపల్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ నీటి సంరక్షణకు సహకరించాలని అప్పుడే భావితరాలు సురక్షితంగా ఉంటాయని అన్నారు. ప్రపంచ వ్యాప్తంగా నీటి కొరత, కాలుష్యం పెరుగుతున్న నేపథ్యంలో నీటి వనరుల సుస్థిర నిర్వహణపై ప్రజలను చైతన్య పరచాలన్నారు. మంచినీటి ప్రాముఖ్యతపై ప్రజలకు అవగాహన కల్పించడానికి ఐక్యరాజ్య సమితి సూచన మేరకు 1993 నుంచి ఏటా మార్చి 22వ తేదీన ప్రపంచ జల దినోత్సవాన్ని నిర్వహిస్తున్నామని వెల్లడించారు. ఈ ఏడాదిని శాంతి కోసం నీరు అన్న నినాదంతో నీటిని సంరక్షించాలని ఐక్యరాజ్యసమితి పిలుపునిచ్చిందని తెలిపారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ వీరయ్య, ఎన్ఎస్ఎస్ అధికారులు బాబురావు, శ్రీనివాసులు, ఎన్‌సీసీ అధికారులు శ్రీనివాసులు, తిరుమలయ్య, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బాధితులకు పరామర్శ



చిత్తూరు ఆస్పత్రిలో బాధితులను పరామర్శిస్తున్న మాజీ ఉప ముఖ్యమంత్రి



రఘునాథరెడ్డి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మాజీ డిప్యూటీ సీఎం నారాయణస్వామి

కార్వేటినగరం: వెదురుకుప్పం మండలం యనమలమంద గ్రామం నుంచి గంగాధరనెల్లూరు మండలంలో దహన క్రియలకు వెళ్లి తిరుగు ప్రయాణంలో శ్రీరంగరాజపురం మండలం పాదలపల్లి వద్ద ట్రాక్టర్ బోల్తాపడి 45 మందికి గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న రాష్ట్ర మాజీ ఉప ముఖ్యమంత్రి కళత్తూరు నారాయణస్వామి శనివారం చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రికి చేరుకున్నారు. చికిత్స పొందుతున్న బాధితులను పరామర్శించారు. బాధిత కుటుంబాలకు ఆర్థిక సహాయాన్ని అందించారు. వైద్యాధికారులతో మాజీ మంత్రి మాట్లాడుతూ బాధితులు పేద కుటుంబానికి చెందిన వారని, వారికి మెరుగైన వైద్య సేవలు అందించి త్వరగా కోలుకునే విధంగా చూడాలన్నారు. ఆయన వెంట చిత్తూరు జిల్లా వైఎస్‌ఆర్ సీపీ ఉపాధ్యక్షుడు గురవారెడ్డి, శ్రీరంగరాజపురం మండల అధ్యక్షుడు మణి, నాయకులు సాజు, వెంకటేష్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

ఘన నివాళి

శ్రీరంగరాజపురం(కార్వేటినగరం): వైఎస్‌ఆర్ సీపీ నాయకుడు రఘునాథరెడ్డి(86) అనారోగ్యంతో మృతి చెందిన సమాచారం అందుకున్న రాష్ట్ర మాజీ ఉప ముఖ్యమంత్రి కళత్తూరు నారాయణ స్వామి ఎస్ఆర్‌పురం గ్రామానికి వెళ్లి ఆయన చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. అనంతరం అతని కుమారుడు వైఎస్‌ఆర్ సీపీ నాయకుడు, సర్పంచ్ దిలీప్‌రెడ్డిని ఓదార్చారు. ఉమ్మడి జిల్లా ఉపాధ్యక్షుడు గురువారెడ్డి, జిల్లా బూత్ కన్వీనర్ అధ్యక్షుడు వెంకటేశ్వరరెడ్డి, వలంటరీ యూనియన్ నియోజకవర్గం అధ్యక్షుడు అశోక్, మండల కన్వీనర్ మణి, సీనియర్ నాయకుడు జనార్దన్, మాజీ మాజీ మండల అధ్యక్షుడు సురేంద్రరెడ్డి(జీడీనెల్లూరు) స్థానిక నాయకులు పలువురు పాల్గొన్నారు.

అంగన్‌వాడీలకు శిక్షణ



శిక్షణ పొందిన అంగన్‌వాడీ కార్యకర్తలతో సీడీపీఓ పద్మసునంద



ఎంపీడీఓ కార్యాలయంలో శిక్షణ కార్యక్రమం



అంగన్‌వాడీ కార్యకర్తలతో సీడీపీఓ, సూపర్‌వైజర్లు

కార్వేటినగరం: ఐసీడీఎస్ సర్కిల్ పరిధిలోని అంగన్‌వాడీ సిబ్బందికి నిర్వహించిన పోషణ్ భి–పడాయి భి శిక్షణా కార్యరకమం శనివారం ముగిసింది. కార్యకర్తలకు సీడీపీఓ పద్మసునంద జ్ఞాపికలను అందించారు. సీడీపీఓ మాట్లాడుతూ ఈ శిక్షణా కార్యక్రమంలో నేర్చుకున్న అంశాలను అంగన్‌వాడీ కార్యకర్తలు తూచా తప్పకుండా అంగన్‌వాడీ కేంద్రాల్లో అమలు చేయాలని ఆదేశించారు. చిన్నారులకు పౌష్టికాహారాన్ని క్రమం తప్పకుండా అందించి పిల్లల ఆరోగ్యాన్ని కాపాడుకోవాలన్నారు. వేసవిలో పిల్లలకు సరైన సమయానికి ఆహారాన్ని అందించాలని సూచించారు. అంగన్‌వాడీ కార్యకర్తలు మాట్లాడుతూ శిక్షణ ద్వారా అనేక అంశాలను నేర్చుకున్నామని, పిల్లల సామర్థ్యాలను పెంచేందుకు ఎంతో ఉపయోగపడుతాయన్నారు. ఈ కార్యక్రమంలో పర్యవేక్షకులు ఇందిర, శామిని పాల్గొన్నారు.

జీడీనెల్లూరులో..

గంగాధరనెల్లూరు: ఐసీడీఎస్ ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కార్యకర్తలకు శిక్షణ తరగతులను సీడీపీఓ వినుతశ్రీ నిర్వహించారు. ఎంపీడీఓ కార్యాలయంలో ట్రైనింగ్ కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఆరు సంవత్సరాల కంటే తక్కువ వయస్సు చిన్నారుల అభివృద్ధి నిర్ధారణ, నూతన విద్యా విధానం ద్వారా చిన్నారులకు ఆటపాటలతో విద్య నేర్పే విధానం, మానసిక ఆరోగ్య స్థితులను మెరుగుపరచడంపై శిక్షణ ఇచ్చారు. ఈ శిక్షణలో సీడీపీఓ వినుతశ్రీ, సూపర్ వైజర్లు అనురాధ, నాగరత్నమ్మ, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

వెదురుకుప్పంలో..

వెదురుకుప్పం: అంగన్‌వాడీ కేంద్రాల్లోని పిల్లల సంరక్షణకు ప్రథమ ప్రాధాన్యమివ్వాలని కార్వేటినగరం సీడీపీఓ పద్మసునంద అన్నారు. వెదురుకుప్పంలో మూడు రోజులపాటు జరిగిన పోషణ భి–పడాయి భి శిక్షణ తరగతులు శనివారం ముగిసింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పిల్లలకు అన్ని విధాలా సేవలు చేసేందుకు అంగన్‌వాడీ కేంద్రాలు దోహదపడాలని సూచించారు. సూపర్‌వైజర్‌లు భారతి, శకుంతల మాట్లాడుతూ వయస్సుకు తగ్గ ఎత్తు, బరువు లేని పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ అవసరమన్నారు. నవచేతన ఆధార్ షీలా గురించి తెలుసుకోవాలన్నారు.

తాగునీటి సమస్యపై అప్రమత్తత అవసరం



పచ్చికాపల్లం సచివాలయంలో రికార్డుల తనిఖీ

వెదురుకుప్పం: గ్రామాల్లో తాగునీటి సమస్య రాకుండా అప్రమత్తంగా ఉండాలని జిల్లా పంచాయతీ అధికారి సుధాకరరావు అన్నారు. శనివారం మండలంలోని పచ్చికాపల్లం గ్రామ సచివాలయాన్ని సందర్శించి రికార్డులను తనిఖీ చేశారు. అదేవిధంగా కొమరగుంటలోని సంపద తయారీ కేంద్రాన్ని(ఎస్‌డబ్ల్యూపీసీ) పరిశీలించారు. అనంతరం వెదురుకుప్పంలో గ్రామ కార్యదర్శులతో సమావేశాన్ని నిర్వహించి సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాగునీటి ఎద్దడి రాకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. అదేవిధంగా ఇంటి పన్నులు విధిగా వసూలు చేయాలని సూచించారు. ఇంటి పన్నులు వసూలుపై యజమానులతో మాట్లాడి సక్రమంగా చెల్లించేందుకు అవగాహన కల్పించాలన్నారు. గ్రామాల్లో పారిశుధ్యం మెరుగుకు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. పరిసరాలను సక్రమంగా శుభ్రం చేయడంతో పాటు చెత్త సేకరణపై కూడా శ్రద్ధ వహించాలని చెప్పారు. ఎస్‌డబ్ల్యూ పీసీ నిర్వహణపై కొన్ని సూచనలు అందించారు. ఆయన వెంట ఈఓపీఆర్డీ పురుషోత్తం ఉన్నారు.

అప్రమత్తంగా ఉండాలి



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న సీఐ సురేంద్రనాయుడు

పుత్తూరు: పట్టణంలో అనుమానాస్పద వ్యక్తులు, నేరస్తులు, అసాంఘిక శక్తులను గుర్తించడానికి తగిన చర్యలు చేపట్టినట్లు సీఐ సురేంద్రనాయుడు తెలిపారు. శనివారం సాయంత్రం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల గ్రౌండ్‌లో యువకులకు, మహిళలకు, వృద్ధులకు, వాకర్స్‌కు పట్టణంలో జరుగుతున్న నేరాలపై అప్రమత్తంగా మెలగాలని అవగాహన కల్పించారు. అనుమానాస్పద వ్యక్తులు ఎవరికైనా తారసపడినా, తెలిసినా పోలీసులకు సమాచారం అందివ్వాలని సూచించారు. గస్తీ తిరిగే పోలీసు సిబ్బందికి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

గాలికుంటు నివారణకు చర్యలు



అరూరు గ్రామంలో పశువులకు టీకాలు వేస్తున్న వైద్య సిబ్బంది

నింద్ర: మండలంలోని పాడి రైతులు తమ పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ చర్యలు తీసుకోవాలని అరూరు పశువైద్యశాల వైద్యాధికారి ప్రభాకర్ వర్మ అన్నారు. శనివారం అరూరు గ్రామంలో టీకాలు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గాలికుంటు వ్యాధి నివారణకు తప్పనసరిగా టీకాలు వేయించాలన్నారు. ఈ నెల 31వ తేదీ వరకు టీకాలు వేస్తున్నామని, రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ముఖ్యంగా పాడిఆవులకు పాల దిగుబడి తగ్గడం, జర్వం, చొంగకారడం, కుంటడం తదితర లక్షణాలు కనిపిస్తే తక్షణం వైద్య సేవలు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.